ఎగురుతున్న ఎర్రమన్ను

అతనూ, నేనూ బయల్దేరాం.

నిడుపాటి మట్టిరోడ్డుమీద నీరసంగా నడుస్తున్నాం. ఏదో మాట్లాడుకుంటున్నాం. కొన్ని పనికొచ్చేవీ, కొన్ని పనికి మాలినవి.

కుళ్ళిపోయిన నేటి సమాజ వ్యవస్థలాగుంది రోడ్డు. గాలిలోకి లేచిన ఎర్రమన్ను ఆకాశంలోకి ఎగురుతూ, బాటసారుల ముఖాలికి రంగు పులుముతోంది.

సూర్యోదయమై అట్టేసేపు కాలేదు. చర్మం థర్మామీటరై సూర్యుడి ఉష్ణోగ్రత కొలుస్తోంది. సూర్యుడికో మాకో గాని జ్వరం జాస్తి అయిందని తెలుసు. ఉదయం కావటంవల్ల చల్లనిగాలులు చెంపల్ని తగిలి ఆ విషయాన్ని స్పష్టం చేయలేకపోతున్నాయి.

అతనూ నేనూ నడుస్తున్నాం. పోస్టాఫీసుకు చేరుకున్నాం. కిటికీ నోటికి పార్శిల్సు అందిస్తున్నాడతను. వేసవికాలపు బడలికలా, ఆలోచనల్ని బరువుగా సారించుకొంటూ, కొండ చిలువలా మందంగా, అక్కడే తచ్చాడుతున్నాను.

ఏడూ ఇరవై నిమిషాలు చూపిస్తోంది పోస్టాఫీసు జీవితం. కుర్చీలో కూర్చున్న పోస్టుమాస్టారు కళ్ళద్దాలలోంచి చూస్తున్నారు. స్నానంచేసి శుభ్రంగా ఉన్న ఆయన ముఖంలో స్ఫోటకం మచ్చలు నిగనిగలాడుతున్నాయి. భూమిమధ్యంనించి నిలువుగా ఎగబ్రాకిన ఎర్రబొట్టు, మధ్యపాపిడి క్రాపు, బలంగా పెరిగిన శరీరం, నాయుడుగారి 'స్టేటస్‌కో'కి సంబంధించిన విషయాలు.

టెలిగ్రాం రిసీవర్ టకటకలాడుతోంది. నాయుడుగారు ధుమధుమలాడుతున్నారు. మెయిల్ ప్యూన్ గడగడలాడుతున్నాడు. పోస్టాఫీసు జీవితం ఏడున్నరకొట్టింది... 'ఏంరా మాదర్‌ఛోద్ !' అన్నారు పోస్టుమాస్టారు. సిగ్నలర్ మరింత ధాటీగా వినిపించింది. 'నువ్వు కళ్ళుమూసుకు పోయేడుస్తున్నావ్రా? వెధవకానా ? ఫో అవతలికి! వెధవ క్రాపు, వెధవ బుష్ కోట్లూ నువ్వూను... నీయిష్టంవచ్చినట్టు ఐదున్నరకి వస్తే నీయబ్బసొమ్మెక్కడేమైనా దాచపెట్టామనుకున్నావురా ?'

అప్పారావు— గోడకి జార్లపడి, గుటకలు మింగుతూ, ఎడమమోకాలు వంచి, అలాగే గోడకి ఆనుకుని వీధిలోకీ,

శూన్యంకేసీ, చూస్తూ నించున్నాడు. పోస్టాఫీసు మామూలు వేళల్లోకంటె మరింత సీరియస్‌గా వేగంగా కదిలిపోతోంది. గోడకి వేలాడుతున్న పోస్టాఫీసుజీవితంకూడా సెకన్లు లెక్కిస్తోంది. పోస్టుజవాను అప్పలనరసయ్య కాళ్ళుజాపుకొని ఒకేఉత్తరం మీద మళ్ళీమళ్ళీ ఒకే ముద్రను కొడుతున్నాడు.

పోస్టుమేస్టారి కుర్చీ ఉరుముతోంది. అప్పారావు - ఆలస్యంగా రావడానికిగల కారణంకంటె అతను బుష్‌కోట్లు వేసుకోడానికిగల కారణం తీరని సమస్య అయింది. అందుకనే అన్నాడు: "వెధవలు! దాని సొమ్ముతిని దాని రొమ్ము గుద్దడం, అడ్డమైన వెధవల్నీ పోగుచేసుకుని కబుర్లు చెప్పడం కాదు."

గోడకి జార్లపడి, నిలువుకాళ్ళ నుంచుని, గుటకలు మింగుతున్న అప్పారావు ఈపాటికి కొయ్యబారిపోయి ఉంటాడు. మనలాగే ఒక మంచి బానిసయిన అప్పారావు ఒక వెర్రి వెధవలాగ పల్లెత్తి మాట్లాడుతాడని అనుకోడానికి ఆధారం లేదు.

"తమతో చెప్పి వెళ్ళానుకదండీ... అక్కణ్నుంచి రావడం కొంచం ఆలస్యమైందండి. మెయిలుకి ఖచ్చితంగా అందిస్తున్నప్పుడు ఒక్క అరగంటలో ఏంపోయిందండీ"— అతి వినయంగా అణకువగా మాట్లాడేననుకున్నాడు. కాని, ఎంత పొగరుగా, తలబిరుసుగా మాట్లాడాడో పోస్టుమాస్టారొక్కరే గ్రహించగలిగారు.

ఎక్కడో ఏ వెధవఇంట్లోనో పెళ్ళని, తాను తోడి నింపవలసిన బిందెలు పూర్తి కాకుండానే, తాను వేయవలసిన పక్కలు వేయకుండానే వెళ్ళిపోవడం పోస్టుమాస్టారికి అవమాన మనిపించింది... ఏయ్! అప్పలనరసయ్యా! వాణ్ణివతలకి గెంటేయ్!'' గర్జించారు పోస్టుమాస్టారు.

''ఎందుకురా అయ్యగారికి కోపం తెప్పిస్తావ్? పెందరాళే రానక్కర్లేదూ?''...అన్నాడు అప్పలనరసయ్య. మామూలు కన్నా మార్పేమీ లేదు కంఠంలో. అంతకన్నా తనకేమీ నిమిత్తంలేనట్టుగా ఉత్తరాలకి ముద్రలు వేస్తూనే ఉన్నాడు.

అప్పారావుని అప్పలనరసయ్య బైటకి గెంటేయలేదు.. అయినా అప్పలనరసయ్య నుదుటిమీద చెమట, చినుకుల్చింది, నామాల్ని కరిగించి, ముక్కుమీంచి కాల్వకడుతోంది. అప్పలనరసయ్య అప్పారావుని గెంటేయలేదు! గబగబా బైటకి వచ్చేశాడు అప్పారావు. వచ్చి ద్వారంపక్క నుంచున్నాడు. అప్పారావులో ఆత్మాభిమానం బుసకొట్టింది. పాతికేళ్ళ అప్పారావు ఒంపులు తీరిన శరీరం, అంత చేతకానిదా అనిపిస్తోంది. 'వెధవకాన్పు!'...పోస్టుమాస్టారి 'వెధవ్రకాపు' వంపులు తిరిగి నిగనిగలాడుతూ చూడ ముచ్చటగా ఉంది.

గబగబా బైటికి వచ్చేశాడు అప్పారావు— అవునా? ఆఫీసు గుండె మామూలుగానే కొట్టుకుంటోంది. మరలన్నీ యథాస్థానంలో కదులుతూనే ఉన్నాయి. పార్శిలుగుమాస్తా

లెక్కలు తేలక, మామూలు ఇబ్బంది పడుతూనే ఉన్నాడు... అప్పలనరసయ్య ఉత్తరాలకి అధికార చక్రాంకితాలు వేస్తూనే ఉన్నాడు. చెమటకి నాని కొట్టుకుపోతున్న ఊర్ధ్వపుండరాల్ని కాపాడుకుంటూనే ఉన్నాడు. పోస్టుమేస్టారి అధికారకంఠం మామూలుగా మొరుగుతూనేవుంది.

'అప్పారావు బంట్రోతు వెధవ' కాడంటే నేను ఒప్పుకోను! వాడి ఉద్యోగఫాయిలోనే వుందా అంతరార్థం. మెయిల్ ప్యూనంటే, మెయిల్ ప్యూనే! పోస్టుమాస్టారంటే, పోస్టుమాస్టారే! అన్నీ కలుపుకొని నాలుగుపుంజీల జీతగాడు అప్పారావుకీ, 'వంద'రూపాయల వేతనం గల నాయుడుగారికీ సామ్యమా? అంతపెద్ద ఉద్యోగస్తుడే నిరాడంబరంగా— పది మంది పిల్లలుంటేనేంగాక! ఒక బనీను వేసుకునో, వేసుకోకుండానో, ఆఫీసులో కూర్చుంటోంటో పీడు— ఈ అప్పారావుగాడు— బుష్‌కోట్లు తొడుక్కోవడం ఏమంత సబబుగావుంది? అప్పారావు బుష్‌కోటుని ప్రస్తావించారంటే అయ్యగారు కన్నెర్రజేశారని కాదు. అతని దుబారాఖర్చుని గురించిమాత్రమే. వ్యక్తుల ఆదాయాన్నిబట్టి, అధికార స్థానాల్నిబట్టి, మనిషి హోదా నిర్ణయించబడుతున్నప్పుడు నౌకరు అప్పారావుగాడు బుష్‌కోటువేయడం ఎంత అపచారమో నేను వేరే చెప్పనవసరం లేదు.

'అప్పారావు నలభై రూపాయల నౌకరైతే నాయుడు గారు వందరూపాయల నౌకరు కదా; ఆయన కామాత్రం జ్ఞానం అక్కర్లేదా అంటారు అజ్ఞానులు! అది చాలాపొరబాటు. ఆయన ఈవూరి పోస్టుకంతటికీ కూడా మాస్టారు. అన్నంత మాత్రాన అప్పారావుకీ మేస్టారు కాదనటానికి వీల్లేదు, తాను మంచివాడు కనుక అప్పారావుని నాలుగు కేకలేసి వూరుకున్నాడు. అబ్బో! అదే తన పైఅధికారులైతేనా? ఒక్క దమ్మిడీ తక్కువైతేచాలు, తక్షణం బేడీలు తగిలించేస్తారు. అప్పుడు అప్పలనరసయ్య, అప్పారావు వగైరాలంతా పోస్టు మాస్టారి సౌజన్యంకోసం త్యాగంచేసి, ప్రమాదానికి గురి కావడం జరుగుతుందనటానికి అవకాశంలేదా?

ఈ మాటల్ని బహుశా ముసలి గుమస్తాయే అనొచ్చు. చివరికి అప్పలనరసయ్య కూడా అనొచ్చు. పోస్టాఫీసుతో ఏమీ సంబంధంలేని దానయ్యకూడా అనొచ్చు. ఏమైనా ఈతర్కంతో నాకేమీ సంబంధంలేదు.

అప్పారావు ఉద్రేకంతో అడుగులువేస్తూ, దెబ్బతిన్న బెబ్బులిలా బుసకొడుతూ, రెండో అరుగుమీదికి వచ్చి డక్కన్‌సిగరెట్ అంటించాడు. దర్జాగా ఆత్మగౌరవం ఉట్టిపడేలా అగ్గిపెట్టె, సిగరెట్‌పెట్టె బుష్‌కోటు జేబులోకి తోసి, నెట్టేశాడు. అప్పారావుకి మైకం ఎత్తింది. నాకేసిచూస్తూ

నన్ను పిలుస్తూన్నట్టుగా కళ్ళుతిరుగుతున్నాయి. నన్నుద్దేశించే ఏదో చెబుతున్నాడు...

"ఎవడబ్బ సొమ్మూ వట్టి పుణ్యానికి పెట్టడంలా! ఎనిమిది గంటల పనిపేరు చెప్పి పన్నెండు గంటలు చేయడానికి ఎవడికచ్చున్నా. ఆవిషయమేదో ఈయాళే కనుక్కుంటా; సూపరెంటుకి పైరిచ్చి!"

నేనతని దగ్గరికి వెళ్ళి ప్రశ్నార్థకంగా చూశాను. అప్పారావు కసిగా మళ్ళీ అందుకున్నాడు. "ఒక్క పోస్టలు పనేకాదు; నానా వెట్టిచాకిరీ చేయించుకుంటాడు... పైగా రంకెలేస్తాడు; రంకెలు! అదేదో నేనూ చూస్తానీయాళ... సూపరెంటుకి టెలిగ్రామిస్తాను...కొంచం రాసిపెడతారా?"—

'అలాగే' అన్నట్టుగా తలాడించాను.

లోపల్నించి అప్పుడే బైటకువచ్చిన అప్పలనరసయ్య కాలు ముడుచుకోడానికి చూస్తూ, "ఎధవ గాడిదకొడుకు! పొగరుమోత్తనం లావైపోయింది... ఊరుకుంటూంటే మరీ గిపసబారిపోతున్నాడు" అన్నాడు. నాకు ఒళ్ళుమండి వెనక్కి తిరిగి చూశాను. అప్పలనరసయ్య నవ్వాడు; నాకేసో... అప్పారావు కేసో చూసి! నవ్వుతూనే లోపలికి వెళ్ళిపోయాడు.

పార్శిల్సుపని పూర్తి చేసుకున్నాడతను. తిన్నగా నాదగ్గరకి వచ్చాడు. 'పోదాం' అన్నాడు. 'సరే' అన్నాను. రోడ్డుమీద వచ్చేపోయే జనం... ఎగురుతున్న ఎర్రమన్ను...

వేడెక్కుతున్న సూర్యకిరణాల కత్తులయుద్ధం... ఇలాంటివేవీ మా దృష్టికి రాలేదు. ఏమిటో అలాగే ఆ నిడుపాటిరోడ్డు మీద ఇద్దరం నడుస్తూ పోతున్నాం.

అతను రఁయిమన్నాడు. నేను తృళ్ళిపడ్డాను. 'అలా గింజుకుంటాడేమిటి వాడు?' అని— అతనుద్దేశించిన 'వాడు పోస్టుమాస్టరో, అప్పారావో, అతను స్పష్టంగా చెప్పలేదు. అయినా పోస్టుమాస్టారు కాకపోతారా అనుకున్నాను.

ఎర్రని ధూళి రేగుతూనే ఉంది. జనం కదులుతూనే ఉన్నారు. అతను ఏవో చెబుతున్నాడు. నేను నీరసంగా ఆలోచిస్తున్నాను.

"పొద్దున్నే ఏడు గంటలకి ఆఫీసుకి చేరుకుంటాడు అప్పారావు. ఆఫీసు పని పూర్తి చేసుకొంటాడు. వెంటనే నగర పర్యటనకి బయల్దేరతాడు. పేట పేటకీ వెళ్ళి ఎనిమిది చదరపుమైళ్ళ నగరాన్ని సర్వే చేసి పోస్టుబాక్సులన్నీ, తెరుస్తాడు. ఉత్తరాల్ని మూటకట్టుకుని సంచీలో వేసుకుంటాడు. పోస్టాఫీసుకు మోసుకొస్తాడు. ఒక గాడిదబరువు తయారవుతుంది. ముద్రలు వేస్తాడు. సార్టింగులో సహకరిస్తాడు. సంచుల్లో పడేసి సీళ్ళు వేస్తాడు. తోపుడుబండి కెత్తుకుని ఒగుర్చుస్తూ, ఆయాసపడుతూ, డక్కన్ సిగరెట్ కాల్చుకుంటూ, తోసుకుంటూ స్టేషన్‌కి పోతాడు. మెయిల్ రాగానే ఈ సంచులందిస్తాడు; కొత్త సంచులు తీసుకుంటాడు. మెయిల్ లేటయితే

పోస్టాఫీసుకు మళ్ళీ వస్తాడు. అమ్మగారి చీరల్ని జాడించడమో అయ్యగారి పిల్లల్ని ఆడించడమో చేస్తాడు. అప్పటికి పది న్నరో, పదకొండో అవుతుంది... తక్షణం తాను తెచ్చిన 'టపా అయ్యగారిముందు వెలుపుతాడు. కవర్లకు కవర్లూ, కార్డులకు కార్డులూ, పార్శెళ్ళూ వెతికి విడమర్చి అయ్యగారి విండో డెలివరీకి సాయపడతాడు.

నడుస్తూనే అన్నాడతను. అంతటితో అవుతాడేమో అనుకున్నాను...ఆపడాని కతనెవరు? ఆపలేదు. అప్పారావు కార్యక్రమం అంతటితో ఆగిపోయేది గనకనా! అందుకనే అతను గుక్క మళ్ళించుకున్నాడు. జాగ్రత్తగా ఒక్కమాట యినా పట్టు తప్పిపోకుండా వింటున్నాను. ఒకదానిమీద ఒకటి పేర్చుకుంటున్నాను. మాటల్ని వింటూ బొమ్మల్ని చూస్తూ కదులుతున్నాను. చిత్రమేమంటే అతని మాటలన్నీ కలిసి, అప్పారావు నిత్యజీవితంలోనిదృశ్యాల్ని చూపిస్తున్నాయి.

అతను చాలా జాగ్రత్తగా చెబుతున్నాడు. భౌతిక వాతావరణంనుంచి తప్పించుకుని, పరధ్యాన్నంలో, అప్పారావు ఆత్మవ్యథతో తాదాత్మ్యత పొందిన ఆధ్యాత్మిక మనస్థితిలో సర్వాన్నీ మరిచి ఆతనితో వెళ్ళిపోతున్నాను.

అతను చెబుతున్నాడు:

"మళ్ళీ సిల్కుబట్టలు వగైరా పోసెంజరుకుపోయే పార్శెల్ను తీసుకుంటాడు. సంచుల్లో వేస్తాడు. మూతిబిగించి

నీళ్ళు వేస్తాడు. మోయలేక మోయలేక మోస్తూ బండిలో కెక్కిస్తూ, తోయలేక తోయలేక తోస్తూ పన్నెండు గంటల పాసెంజరుకోసం బయల్దేరతాడు. అది రెండింటికి రావచ్చు. నాలుగింటికైనా రావచ్చు!...లేక సకాలానికేనా రావచ్చు. సకాలానికే వస్తే పని పూర్తి చేసుకుని నాలుగు మెతుకులు తింటాడు...లేకపోతే మళ్ళీ పట్టణపర్యటన...మళ్ళీ ఉత్తరాల సేకరణ...మళ్ళీ సార్టింగు...మళ్ళీ సీళ్ళు వేయడం, స్టేషన్‌కి తేవడం...మధ్యాహ్నం మెయిల్ వెళ్ళేసరికి నాలుగు గంటలూ వేస్తారు. అప్పటికికాని నాలుగు మెతుకులు పొట్టలో వేసుకోడానికి పడదు. ఆదరా, బాదరాగా, తిని, చేతులు కడుక్కుని, మళ్ళీ పార్శిళ్ళు చేతబుచ్చుకొని సాయంత్రం ఆరుగంటల బండికి, తయారౌతాడు...వెంటనే అయ్యగారి సొంతపనులు ఏమైనా ఉన్నయ్యేమో కనుక్కుంటాడు...ఇంటికి సరిపోయే నాలుగు బాల్చీల నీళ్ళు తోడి పెట్టడమో, ఏడుస్తున్న చంటి వాణ్ణి అటూ ఇటూ తిప్పడమో, అమ్మగారికి అవసరంగా తెచ్చి పెట్టాల్సిన బజారు సరుకుల్ని చేరవేయడమో—అన్నీ చిత్తశుద్ధిగా చేస్తాడు. తర్వాత ఎప్పుడో అయ్యగారు సెల విస్తారు; అప్పుడు ఇంటికిపోతాడు అప్పారావు. రాత్రి నిద్ర పోతాడో లేదో, అప్పారావుకు త్వరగానే తెల్లారిపోతోంది. ఇదే అప్పారావు పోస్టాఫీసు జీవితం..."

అతనింక మాట్లాడలేక పోయాడు. నాచేయి గట్టిగా నొక్కి కోపంతో నిట్టూర్చాడు.

నేనేమీ మాట్లాడలేదు. మాట్లాడే ఓపిక కూడా లేదు నాకు.

అతనూ నేనూ నడుస్తున్నాం.. హోటల్‌కి చేరుకున్నాం. మిగిలిన అయిదణాల డబ్బుల్ని ఖర్చుచేశాం. ఇవతలకి వస్తున్నప్పుడు అతను అన్నాడు: "ఇందాకా రశీదులూం మిగిలిన డబ్బులూ తీసుకోలేదు; దాకేగనక అలా వెళ్ళి తీసుకుపోదాం" అని.

"అలాగే" అన్నాను.

త్వరత్వరగా అడుగులువేస్తూ నడుస్తున్నాం. ఇంచు మించు మౌనంగా నడుస్తున్నాం. ఈలోపుగా అప్పారావుకీ నాయుడుగారికీ సంఘర్షణ తీవ్రరూపం ధరిస్తుందనీ తెలిగ్రాం రాయాల్సిన ఆవశ్యకతకూడా తప్పకఏర్పడుతుందనీ ఊహించు కుంటూ నడుస్తున్నాను. మా యిద్దరి జీవిత వ్యాపారానికీ సంబంధించినదే అయినా, పోస్టాఫీసు పనికంటే అప్పారావు సంగతే— నాకు పట్టుకున్న సమస్య! ఈపాటికి వాడు ఏం చేస్తూ ఉంటాడో!

ఏంచేస్తూ ఉంటాడు? అప్పారావుకీ పోస్టుమాస్టారికీ సంఘర్షణ తీవ్రరూపం ధరిస్తుంది. మేము ఇలా బైటకివచ్చామో లేదో పోస్టుమాస్టారు అప్పారావుని లోనికి పిలుస్తారు. పిలుస్తా రేంటి, పిలిచాడు. ఛడామడా తిట్టి వాడి ఆత్మగౌరవాన్ని ఖూనీచేసి ఆఖరికి నిన్ను "మసిచేస్తాను జాగ్రత్త!" అన్నారు.

క్రోధం దానవత్వాన్ని రెచ్చగొట్టినప్పుడు మానవుడెంత అసహ్యకరమైన మాటలనగలడో అంతా అన్నారు.

అప్పారావు భరించలేకపోయాడు. అవమానాలు భరించినకొద్దీ మానవుడిలోని ఓర్మి పూర్తిగా నశించి, చావో బ్రతుకో తేల్చుకోవలసిన ఆఖరిప్రయత్నం విజృంభిస్తుంది.

కనుకనే అప్పారావు సహనం బద్దలైంది. "మీరేదో పెట్టి పోషిస్తున్నట్టు మాట్లాడుతారేంటి? అనవసరంగా నోరు ఖాళీ చేయకండి. మీరొకటంటే నేను పదనాల్సివస్తుంది..." ఎలాగో తెగించి అనేశాడు అప్పారావు.

ఇంకేముంది! పోస్టాఫీసు గుండె గబగబా కొట్టుకుంది. శ్వాస ఎగతన్నింది. ఊపిరి బిగిసిపోయింది. టకటకమంటూ టెలిగ్రాం రిసీవర్ శబ్దించింది. కోపం హెచ్చి, కోపంతో పాటు భయం ఆక్రమించి, ఇంచుమించు స్మారకంలేని స్థితిలో అప్పల నరసయ్య వేగంగా ముద్రలు గుద్దుతున్నాడు. ముసలిగుమస్తా టేబిలుమీద కాగితాలు టపాటపా కొట్టుకుంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, పోస్టాఫీస్ జీవితంమీద గాలి దుమారం రేగింది. భూకంపం పుట్టింది.

జీవితంలో మొట్టమొదటిసారిగా అప్పారావు— ఎందరికంటేనో అధముడైన నౌకరుగాడి నోటినుంచి ఇలాంటి ధిక్కార వాక్యాల్ని విన్నారు పోస్టుమాస్టరు. ప్రతిఉత్తరమూ

లేచి నుంచుని ఆయన ముఖంలోకి వెక్కిరిస్తూ చూసి, ఫక్కున నవ్వినట్టయింది.

ఆశ్చర్యంలేదు. అవమానం ఎప్పుడూ ప్రతీకారాన్ని కోరుతుంది...దానితో, ఒక్కసారిగా నాయుడుగారు హిట్లరు అయ్యారు. ముస్సోలినీ అయ్యారు. టోజో అయ్యారు. డయ్యరూ అయ్యారు! చనిపోయి, చరిత్ర కడుపులోంచి, తమ వికారముఖాలనెత్తి తొంగిచూస్తున్న యుగయుగాలనాటి పాలకుల అధికారదర్పమంతా శ్రీ నాయుడుగారిలో ఒక్కసారిగా మూర్తీభవించింది.

పాపం! అప్పారావు చెబుతూనే ఉన్నాడు: "మీదికి రాకు; వచ్చావా, నీపని బాగా జరగదు!" అని... అదేం ఖర్మమోకాని, పాపం, పోస్టుమాస్టారికా మాటలు వినిపించలేదు.

ధిక్కారమును సహించలేని పోస్టుమాస్టరు ఆవేశంతో, దూకుడుగా అప్పారావుమీదికి వచ్చారు.. వచ్చీగావడంతో చేసాచి పతాలుమని ఒక్క లెంపకాయ కొట్టేరు. పోస్టాఫీసు ప్రతిధ్వనించింది. అప్పలనరసయ్య నోరు వెళ్ళబెట్టి చూస్తున్నాడు... ముసలిగుమాస్తా నిజంగా కొయ్యబారిపోయాడు. గోడమీద వేలాడే ప్రాణంలేని పోస్టాఫీసు జీవితం ఒక్కగంట కొట్టి వడివడిగా నడిచిపోతూనే ఉంది.

అప్పారావెలా సర్దుకున్నాడోగాని, అతికష్టంమీద నిలదొక్కుకున్నాడు. చెంప ఛెళ్ళుమన్న చప్పుడు వినిపించడం పోస్టుమాస్టారు తమ సొంత దవడ తడుముకోవడం అన్నీ ఒక్కమారే జరిగిపోయాయి. అప్పారావా సమయంలో జోన్ ఆఫ్ ఆర్క్ అయ్యాడు; అబ్రహాం లింకన్ అయ్యాడు. లెనిన్ అయ్యాడు. మోసిటెంగ్ కూడా అయ్యాడు.

విప్లవం ప్రారంభమైంది. కేకలతో గల్లంతులతో ఆఫీసు నిండిపోయింది. గబగబా నలుగుర్నీ నాలుగు మూలలకీ తరిమాడు, పోస్టుమాస్టరు. ఒక మహాభీభత్సం ఫోస్టాఫీసు చుట్టూ నృత్యం చేస్తోంది. ఎవరు వెళ్ళి రిపోర్టు చేశారో తెలీదు. అప్పలనరసయ్య అక్కడేవున్నాడు. లారీడుబలగంతో సబిన్‌స్పెక్టరు చక్కావచ్చాడు. పోస్టుమాస్టారు స్టేటుమెంటు ఇచ్చారు. తన మంచితనాన్నీ, వాడి చెడ్డతనాన్నీ వివరించి తూచా తప్పకుండా చెప్పారు. సబిన్‌స్పెక్టర్ అప్పారావులో కమ్యూనిస్టుని చూశాడు. దాన్ని శక్తివంచన లేకుండా సమర్థించాడు పోస్టుమాస్టరు.

అప్పారావుని తక్షణం రిమాండులో ఉంచారు. ఏమైతేనేం...? ఎక్కడి ఉత్తరాలక్కడే బంద్ అయిపోయాయి. టపాకోసం మెయిలాగిపోయింది. పావుగంట, అరగంట, ముప్పావుగంట, గంట. స్టేషన్‌నుంచి మెయిల్ కదలటంలేదు. అందరూ కంగారు పడుతున్నారు. పైస్టేషన్ల వాళ్ళు ఏం

ఏక్సిడెంటు వచ్చిందో అని గాభరా పడుతున్నారు. అప్పుడే ఒక విలేఖరి ఏ కమ్యూనిస్టులో రైలుపట్టాలు తొలగించారనీ, మెయిలు తిరగబడిందనీ ఎంతమంది మరణించారో ఎంతమంది గాయపడ్డారో లెక్క తెలీడంలేదనీ పత్రికకి టెలిగ్రాం ఇచ్చే వుంటాడు.

ఈ కేసు అప్పుడే ఎలాగాపోదు. ఇది తప్పకుండా క్రిమినల్ సెక్షన్లన్నిటినీ గాలిస్తుంది. ఇందులో నన్ను సాక్ష్యం వేస్తారేమో? ఏమిటి చెప్పడం? నిజం చెప్పాలో అబద్ధం చెప్పాలో... నాకు తెలీడంలేదు. నా సాక్ష్యంలోనే అప్పారావు పెళ్ళాం బిడ్డల భవిష్యత్ ఆధారపడివుంది.

"ఇక్కడే నుంచో; రశీదులు పుచ్చుకొని ఇప్పుడే వస్తా!" అన్నాడతను.

తృళ్ళిపడ్డాను. అప్పారావు ఏడీ? పోస్టాఫీసు అరుగు మీదికి చూశాను.

అప్పారావు చెమటుగాడ్చుకుంటూ. తపాలా సంచుల్ని భుజంమీదికి ఎత్తుకుంటూ "ఎవడికోసం పిలుస్తాడండీ! చచ్చినట్టు పిల్చాడు" అంటూ నవ్వాడు.

అలాగే నిశ్చేష్టుణ్ణయి నిలబడిపోయాను.

★